క్లుప్తంగా

ప్రశంసాపత్రం అందజేత



పాన్‌గల్: ప్రజా పాలన విజయోత్సవాలల్లో భాగంగా మండల స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ఇంగ్లిష్ మీడియం నుంచి ప్రథమ స్థానం పొందిన పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి రాకేష్ శనివారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి చేతుల మీదుగా ప్రశంసాప్రతం, మెమొంటో అందుకున్నాడు. విద్యార్థికి గైడ్ టీచర్‌గా మల్లేష్‌కుమార్ వ్యవహరించారు. విద్యార్థి బహుమతి అందుకోవడంపై ఎంఈఓ శ్రీనివాసులు, పాఠశాల హెచ్‌ఎం విజయ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

వీపనగండ్ల: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పాఠశాలలో జరుగుతున్న వివిధ రకాల పోటీల్లో ప్రతిభను కనబర్చి కలెక్టర్‌తో ప్రశంసాపత్రం అందుకున్న జయవర్ధన్‌ను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి హైస్కూల్ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి గెలుచుకోవడం తమ పాఠశాలకు గర్వకారణమని జీహెచ్‌ఎం భానుప్రకాష్ అన్నారు.

ఖిల్లాఘనపురం: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మండల స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో మామిడిమాడ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ విద్యార్థిని ఎం.పూజ ప్రథమ స్థానంలో నిలవడంతో ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రశంసాపత్రం, మెమొంటోను అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పెబ్బేరు: మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ సోషల్ మీడియా వారియర్ కర్ణాకర్‌నాయుడు ఇటీవల ఆరోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం అందజేసి పార్టీ తరుపున అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, రఘుపతిరెడ్డి, పెద్దింటి వెంకటేష్, రాజశేఖర్, సాయినాథ్, వడ్డె రమేష్, మొగులయ్య, మధు, బీచుపల్లి తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు

పాన్‌గల్: పాత గొడవలను దృష్టిలో ఉంచుకొని ఒకరిపై దాడి చేసి గాయపర్చిన ఘటనలో శనివారం ముగ్గురిపై కేసు నమోదైనట్లు మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దొండాయిపల్లికి చెందిన దాసర్ల వెంకటస్వామికి పాలివారైన దాసర్ల బాలపీరుకు భూమి విషయంలో పాత గొడవలు పెట్టుకొని ఇద్దరి మధ్య వాగ్వివాదం జరుగుతున్నాయి. భూమికి సంబంధించి పాత గొడవలను మనస్సులో పెట్టుకొని ఈనెల 5వ తేదీ రాత్రి బాలపీరు, అతడి బావమర్దులు దేవేందర్, శివ మద్యం మత్తులో ముగ్గురు కలిసి దాసర్ల వెంకటస్వామి ఇంటికి వెళ్లి పరుషపదజాలంతో తిడుతూ రాయితో దాడి చేసి గాయపర్చారన్నారు. దాసర్ల వెంకటస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలపీరు, దేవేందర్, శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

హమాలీల కూలి పెంచాలి

ఆత్మకూర్: మార్కెట్‌యార్డులో పనిచేస్తున్న హమాలీలకు కూలి రేట్లు పెంచాలని కోరుతూ టీయూసీఐ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ అధికారులకు డిమాండ్ నోటీసు అందజేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, రాజు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరల కారణంగా హమాలీల కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. వెంటనే కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భగవంతు, మోహన్, కిరణ్, మనోజ్, వెంకటన్న, కురుమూర్తి, అమీర్, ఆంజనేయులు ఉన్నారు.

‘తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చాలి’

గోపాల్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహం నమూనాను మార్చాలని, లేదంటే తగిన మూల్యం చెల్లించుకుంటారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. గతంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం రాష్ట్ర గౌరవానికి ప్రతీకగా ఉండేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఎక్కువ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చామని, అవి పూర్తయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఉద్యోగాలు భర్తీ చేసిందని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శేఖర్, తిరుపతి యాదవ్, మన్యంనాయక్ పాల్గొన్నారు.

క్షయ నియంత్రణకు కృషి



కరపత్రాలు విడుదల చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

వనపర్తి: క్షయను పారద్రోలేందుకు జిల్లాలో వంద రోజుల ప్రత్యేక కార్యచరణ చేపడుతున్నట్లు కలెక్టర్ ఆదర్శ్‌సురభి తెలిపారు. శనివారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి ఆయన మొబైల్ ఎక్స్‌రే, తెమడ పరీక్ష యంత్రంతో కూడిన అంబులెన్స్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2025 మార్చి 24 నాటికి క్షయవ్యాధిని దేశంలో నియంత్రించేందుకు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. నిక్షయ్ శిబిర్ కార్యక్రమంలో భాగంగా క్షయ సర్వే నిర్వహిస్తున్నామని, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు సహకరిస్తే జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చొచ్చన్నారు. ఎవరికైనా 2 వారాలకు మించి తెమడతో కూడిన దగ్గు రావడం జ్వరం, నీరసం, అకస్మాత్తుగా బరువు తగ్గడం, పొగ, మద్యం తాగే వారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. క్షయ వ్యాధి పాజిటివ్ వచ్చిన వారికి వెంటనే వైద్యం అందించాలని సూచించారు.

వైద్య సిబ్బంది సేవలు అమోఘం

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో వైద్య సిబ్బంది బాగా పనిచేశారని, అదే స్ఫూర్తితో జిల్లాలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. వైద్య సిబ్బందికి అవసరమైన నిధులు, సహాయ సహకారాలు చేసే బాధ్యత తాను తీసుకుంటానని, జిల్లా ప్రజలను ఆరోగ్యవంతులుగా ఉంచే బాధ్యతను వైద్య సిబ్బంది తీసుకోవాలని కోరారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రతి నెల కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.వెయ్యి ఇస్తుందని, తనవంతుగా ఒక్కొక్కరికి నెలకు 3 కిలోల బియ్యం, 30 గుడ్లు, కిలో నూనె, కిలో పప్పు ఆరునెలల పాటు అందిస్తామన్నారు. జిల్లాకు మెడికల్ స్టోర్ మంజూరయిందని, రూ.20 లక్షల వ్యయంతో మరో మొబైల్ ఎక్స్‌రే మిషన్ రాబోతుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ మహేష్, క్షయ వ్యాధి ప్రోగ్రాం ఆఫీసర్ డా.సాయినాథ్‌రెడ్డి, ప్రోగ్రాం, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



ఊరేగింపుగా బయలుదేరిన అయ్యప్పస్వామి



కలశాలు, కావడులతో అయ్యప్ప భక్తులు

కొత్తకోట: మండల కేంద్రంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో సుబ్రమణ్యషష్ఠి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మహా పడిపూజ, కావడి సేవ కార్యక్రమం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. గోపాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పడిపూజ కార్యక్రమం తెల్లవారుజామున 4 గంటలకు గణపతి హోమంతో ప్రారంభించారు. అనంతరం స్థానిక అంబాభవాని ఆలయంలో అయ్యప్పస్వామికి అభిషేకించే కలశాలను, పాలతో నింపిన కావడులకు పూజలు చేసి అక్కడి నుంచి మేళతాళాలు, భాజాభజంత్రీలతో, మహిళల కోలాటాలతో శోభాయాత్రగా భూతనాథ అయ్యప్ప అన్నదాన క్షేత్రానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ గణపతి స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్ప స్వామికి అష్టగంధ కలశాలు, పంచామృతాలతో త్రిమూర్తులకు అష్టాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాలికాంబలు, అయ్యప్పస్వాములు చేసే నృత్యం ఆద్యంతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు ధూపం నాగరాజు కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు. అంతేకాకుండా ఆదివారం సాయంత్రం 6 గంటల 30 నిమిషాలకు భూతనాథ అయ్యప్ప అన్నదాన క్షేత్రంలో మహా పడిపూజ ఉంటుందని, ఈ కార్యక్రమానికి పేరుసోముల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఉపాసకులు రామ్మోహన్ స్వామివారు, అంబత్రయ క్షేత్ర పీఠాధిపతులు ఆదిత్య పరాశ్రీ స్వామివారు, రాయిచూర్ సాలిమఠ పీఠాధిపతి సూగూరయ్య మహా స్వామి పాల్గొంటారని గోపాలకృష్ణ గురుస్వామి తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి దాతగా పాలెం మురళీధర్‌రెడ్డి, అల్పాహార దాతగా విశ్వమోహనాచారి, సౌండ్, భజన బృందం దాతగా నాగరాజు గౌడ్ ఉన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు ధూపం నాగరాజు, ప్రధాన కార్యదర్శి పొగాకు అనిల్, కోశాధికారి విశ్వనాథం గంగాధర్, ఉపాధ్యక్షుడు లింగేశ్వర్, అర్చకులు జోషి రవికాంత్, గంగాధర్, జంగం నటరాజ్, అనిల్, గురుస్వాములు ఉమామహేశ్వర్‌రెడ్డి, కండే నరేష్, రఘుచారి, మోహన్‌రెడ్డి, కవీంధర్‌రెడ్డి, మద్దిగట్ల బాలకృష్ణ, సత్యంసాగర్, వేముల సుధాకర్‌రెడ్డి, దంతనూరు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చు రాముకు డాక్టరేట్



వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకుడు బచ్చు రాముకు డాక్టరేట్ లభించింది. కొన్నేళ్లుగా తాను చేసి సేవా కార్యక్రమాలను గుర్తించి తమిళనాడు రాష్ట్రంలోని ఊటీ యునైటెడ్ నేషన్ ఇంటర్నేషనల్ పీస్ ఆఫ్ కౌన్సిల్ నుంచి డాక్టరేట్ అవార్డును అందుకున్నట్లు బచ్చు రాము తెలిపారు. వనపర్తి ప్రజల హృదయాలను గెలుచుకొని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ వారి మద్దతును పొందిన బచ్చు రాము సేవలు ప్రశంసనీయమని పలువురు ఆనందం వ్యక్తం చేశారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



ఆత్మకూర్: అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని ప్లాస్టిక్ నిర్మూలన, పరిసరాల పరిశుభ్రతకు కట్టుబడి ఉండాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ శశిధర్ అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక ఎంవీ రామన్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అన్సీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వంట ఏజెన్సీల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులు

అమరచింత: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న వంట ఏజెన్సీ మహిళల సమస్యలు వెంటనే పరిష్కరించాలంటూ ఎంఈఓ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రగతిశీల మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ కొన్ని నెలలుగా వంట ఏజెన్సీలకు బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వం ఆదేశించడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల భోజనానికి అయ్యే ధరను సైతం పెంచాలని డిమాండ్ చేశారు. నిత్యం గుడ్డు ధర పెరుగుతున్నా పట్టించుకోవడం లేదని, దీంతో వంట ఏజెన్సీలు అప్పులు చేసి మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారని వాపోయారు. వంట కార్మికులకు ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఒక్కొక్కరికి రూ.10వేల గౌరవ వేతనం అమలు చేయాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. రాజు, గోవిందమ్మ, రాజమ్మ, నాగమణి, నిర్మల, ఆశమ్మ, రాణమ్మ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

అమరచింత: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురిని శనివారం ఆత్మకూర్ సబ్‌కోర్టులో హాజరుపర్చగా జడ్జీ ముగ్గురికి రూ.వెయ్యి జరిమానాతో పాటు మరొకరికి ఐదు రోజుల జైలు శిక్షను విధించారని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడుపరాదని సూచించారు.

సుబ్రమణ్యస్వామి షష్టి వేడుకలు

వనపర్తి టౌన్: పట్టణం సమీపంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సుబ్రమణ్యస్వామి షష్టి వేడుకలు శనివారం మాలధారులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పాలకావడితో అభిషేకం, ర్యాలీ, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గురుస్వాములు ముత్తుకృష్ణ, వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ 12 ఏళ్లుగా పాలకావడితో అభిషేకాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ విధమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల జీవితాల్లో ఆశ, ఆనందాన్ని నింపి, వారిని శాంతితో కూడిన జీవన మార్గం వైపు నడిపిస్తాయన్నారు.

మారెమ్మ పండుగకు తండాల ముస్తాబు



చంద్రనాయక్ తండాలో ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న గిరిజనులు

- నాలుగు రోజుల పాటు ఉత్సవాలు
- ఇంటి ఆడపడుచులు, బంధువుల రాకతో కోలాహలం



తూక్యానాయక్‌తండాలో అగ్నిదేవుడికి పూజలు చేస్తున్న భక్తులు

అమరచింత: గిరిజనుల ఆరాధ్యదైవంగా పూజలందుకుంటున్న మారెమ్మ దేవత ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా మండలంలోని చంద్రనాయక్‌తండా, దీప్లాతండా, తూక్యానాయక్ తండా, కొత్తతండాల్లో గిరిజనులు ఉత్సవాలకు తగు ఏర్పాట్లు చేశారు. ఒక్కొక్క కుటుంబం సుమారు రూ.2 నుంచి రూ.4 లక్షల వరకు ఖర్చు చేస్తూ కనులపండువగా ఉత్సవాలను నిర్వహిస్తారు. ఆడపడుచులతో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు తండాలకు చేరుకుంటారు. అమ్మవారిని తమ ఇంట్లోకి రమ్మంటూ ఆహ్వానం పలికే విధంగా భక్తిశ్రద్ధలతో ఇళ్ల ముందు శనివారం పూజలు చేసి ఆంజనేయస్వామికి పిండి వంటలతో నైవేద్యాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.

తుల్జాభవానీ ఆరాధన

మహారాష్ట్రలోని తుల్జాభవాని మాత భక్తులుగా ప్రతి కుటుంబంలో అమ్మవారిని ఆరాధిస్తూ ఇళ్ల ముందు అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేసుకుని పోట్లేళ్లను బలిచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. ప్రతి ఏడాది తుల్జాపురానికి వెళ్లి మొక్కులు తీర్చుకోలేని పరిస్థితులు తమ పూర్వీకులకు ఉండటంతో అమ్మవారు కలలో కనిపించి ప్రతి రెండేళ్లకు ఒక పర్యాయం తనకు ఉత్సవం జరిపించి తమ ఇంటి ముంగిళ్లలోనే పూజలు నిర్వహిస్తే చాలని అమ్మవారు ఆదేశించడంతో నాటి నుంచి ఇప్పటి వరకు ప్రతి రెండేళ్లకు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

అమ్మవారికి విశేష పూజలు



చంద్రప్పతండాలోని మారెమ్మ ఆలయంలో ప్రతి రెండేళ్లకోసారి ఉత్సవాలు నిర్వహించి అమ్మవారికి బోనం సమర్పిస్తారు. అనంతరం అమ్మవారికి పోట్లేళ్లను బలిచ్చి తమ మొక్కులు చెల్లించుకోవడం ఇక్కడి ప్రజలకు అనాదిగా వస్తున్న ఆచారం.

పూర్వీకుల నుంచి..



తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్న ఆచారాన్ని ఇప్పటికీ పాటిస్తూ తమ ఇంటి దేవతకు మొక్కులు చెల్లించుకుంటాం. ఎంత చిన్న కుటుంబం అయినా సరే తమ శక్తి మేర ఉత్సవాల్లో అమ్మవారి పూజల కోసం ఖర్చు చేయడానికి వెనుకాడం. అందరూ సంతోషంగా ఉండి, పాడిపంటలు సమృద్ధిగా పండాలంటూ అమ్మవారి ఉత్సవాలను నిర్వహించుకుంటున్నాం.

– వెంకటనాయక్, చంద్రప్పతండా

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

గోపాల్‌పేట: పదేళ్ల కాలంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, అభివృద్ధి అంటే ఏంటో నియోజకవర్గంలో చేసి చూపిస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిచామని తెలిపారురు. వరికి రూ.500 బోనస్ ఇస్తుంటే రైతులు ఆనందం వ్యక్తం చేస్తుంటే.. ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తొందర్లోనే మహిళలకు రూ.2500 ఇస్తామని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి మండల ఇన్‌చార్జ్ సత్యశీలారెడ్డి, రేవల్లి మండల అధ్యక్షుడు పర్వతాలు తదితరులు ఉన్నారు.

‘పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు స్వీకరిస్తాం’

ఆత్మకూర్: మండలంలోని పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటిస్తున్నామని అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించారు. సెప్టెంబర్ 13న ఓటరు జాబితాను ప్రకటించామని గుర్తుచేశారు. మండలంలో 13 గ్రామ పంచాయతీలకు గాను 118 వార్డుల్లో 118 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో మొత్తం 19,703 మంది ఓటర్లు ఉన్నారని, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10వ తేదీ లోపు చెప్పాలని సూచించారు.

ఓటర్ల జాబితా విడుదల

కొత్తకోట రూరల్: త్వరలో జరుగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశానుసారం కొత్తకోట ఎంపీడీఓ చెన్నమ్మ, ఎంపీఓ సుదర్శన్ ఆయా గ్రామాల్లోని వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసి శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో నోటీస్ బోర్డుపై ఉంచారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిండమే లక్ష్యంగా ఓటర్ల జాబితా విడుదల చేశామన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి భూమిపూజ



ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్

పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించే ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్ శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామానికి వచ్చిన గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ను కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని వారు విన్నవించారు.

గ్రంథాలయ భవన నిర్మాణాలకు నిధులు

మండలంలోని మాందాపూర్, చిన్నంబావి మండల కేంద్రంలో నూతన గ్రంథాలయ భవనాలు నిర్మించేందుకు రూ.20 లక్షల నిధులు మంజూరైనట్లు సంస్థ చైర్మన్ పేర్కొన్నారు. ఒక్కొక్క భవనానికి రూ.10లక్షల చొప్పున కేటాయించారన్నారు. నిరుద్యోగులు, విద్యార్థుల సౌకర్యార్థం మంత్రి జూపల్లి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. నిధులు మంజూరు చేయడంపై జిల్లా గ్రంథాలయ సంస్థ తరపున మంత్రి జూపల్లికి, కలెక్టర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

ఆత్మకూర్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్న పంచాయతీ కార్యదర్శులపై రోజురోజుకూ పనిభారం పెరుగుతూనే ఉందని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డికి అందజేశారు. సమగ్ర కుటుంబ సర్వే, డేటా ఎంట్రీతో సెలవులు లేకుండా గడిపామని, ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక బాధ్యతతో ఇబ్బందులు తలెతుతున్నాయని వాపోయారు. కొన్నిసార్లు ఆదివారం కూడా పనిచేయాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు హరిరాంసాగర్, అధ్యక్షుడు దాసు, ప్రధాన కార్యదర్శిగా మణ్యం, కోశాధికారి వంశీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శిరీష, నాగరాజు, సలహాదారులు లక్ష్మీనారాయణ, జైపాల్‌రెడ్డి, నస్రీన్‌బేగం, వంశీ, నరేష్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

బీటీ రోడ్డు పనుల ప్రారంభంపై హర్షం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లి సమీపంలో వెలసిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి వెళ్లే రహదారి పనులు ఆదివారం ప్రారంభమవ్వడంతో పలు గ్రామాల ప్రజలు తమ హర్షం వ్యక్తం చేశారు. నర్సింహస్వామి ఆలయానికి వెళ్లేందుకు గాను గతంలో రూ.నాలుగు కోట్లు మంజూరు కాగా గతంలో కొంత మేర పనులు జరిగి నిలిచిపోవడంతో నిరాశకు గురయిన పలు గ్రామాల ప్రజలు మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో తిరిగి పనులు ప్రారంభించారు. దీంతో సంగినేనిపల్లి, తూంకుంట, వల్లభాపురం, వీపనగండ్ల, వల్లభాపురంతాండ గ్రామాల ప్రజలు తమ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మౌలాలి, కాంగ్రెస్ నాయకులు ధనుంజయ్య, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యం



ప్రింటర్ బహుకరిస్తున్న న్యూ సక్సెస్ స్కూల్ యాజమాన్యం

మదనాపురం: పదేళ్లుగా విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులకు ఎలాంటి పదోన్నతులు, బదిలీలు చేపట్టకుండా పాఠశాలలను నిర్వీర్యం చేశారని, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత 21 వేల మంది ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు, 11 వేల మందిని డీఎస్సీ ద్వారా నేరుగా నియమించారని మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ చెప్పారు. శనివారం మండల వనరుల కేంద్రంలో జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో న్యూ సక్సెస్ స్కూల్ యాజమాన్యం తరపున కార్యాలయానికి ప్రింటర్, స్కానర్ బహూకరించారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో అభినందించారు. ఎంఈఓ షేక్‌ఫరూక్ హుస్సేన్ అధ్యక్షత జరిగిన సమావేశంలో తహసీల్దార్ అబ్రహంలింకన్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, హెచ్‌ఎంలు మద్దిలేటి, లక్ష్మీనారాయణ గుప్త, కాంగ్రెస్ నాయకులు జగదీష్, వడ్డె కృష్ణ, హనుమాన్‌రావు, మహాదేవన్‌గౌడ్, ఎండీ రావూఫ్, సత్యశీలారెడ్డి, రామకృష్ణ, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇంటింటి సర్వే



అమరచింత: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నామని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో శనివారం ఆర్‌ఐ వెంకటయ్యతో కలిసి ఇందిరమ్మ దరకాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వారు నివసిస్తున్న ఇంటిని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సిబ్బంది ద్వారా సర్వే పూర్తి చేయడానికి తగు ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే..



పాన్‌గల్: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సీఎం కప్ పోటీలు ప్రారంభించినట్లు ఎంపీడీఓ గోవింద్‌రావు పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, ఫుట్‌బాల్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 10, 12వ తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల, పెద్దగూడెం, కడుకుంట్ల, రాజపేటతో పాటు పలు గ్రామాల్లో సీఎం కప్ క్రీడా పోటీలను శనివారం ప్రారంభించారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించి వారిలో ప్రతిభను వెలికి తీయొచ్చన్నారు.

ఖిల్లాఘనపురం: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలని ఎంపీడీఓ వెంకటాచారి, తహసీల్దార్ సుగుణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో సీఎం కప్ గ్రామ స్థాయి క్రీడలను వారు ప్రారంభించారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
వనపర్తి — ఎ. గణేష్ కుమార్ - 91605 62261
కొత్తకోట / పెబ్బేర్ — ఇ. రాజశేఖర్ గౌడ్ - 97000 09392
టోల్ ఫ్రీ నెం.: 1800 2701083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

యాడ్స్ మేనేజర్
9951602829
జబ్బార్ లాల్ : 9553955603